క్లుప్తంగా

బతుకమ్మ ఘాట్ పరిశీలన



ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: పట్టణంలోని ఇల్లెందు మంచినీటి చెరువును ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి పరిశీలించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌తో కలిసి చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఘాట్‌ను సందర్శించారు. అక్కడి లైటింగ్, స్టేజీ నిర్మాణం ఏర్పాట్లను కమిషనర్ శ్రీకాంత్ వివరించారు. బతుకమ్మ చివరి రోజున సద్దుల బతుకమ్మతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ ఆడనున్నందున ఏర్పాట్లు చేయాలని సూచించారు.

చాకలి ఐలమ్మ మునిమనవరాలి పూజలు



మండపం వద్ద శ్వేత, చెన్నయ్య తదితరులు

పాల్వంచ: పాల్వంచ మార్కెట్ ఏరియాలోని అమ్మవారి మండపాల్లో తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మునిమనవరాలు, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత శనివారం పూజలు చేశారు. ఈ పూజల్లో జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు గంధమల్ల చెన్నయ్య కూడా పాల్గొన్నారు. అనంతరం జెన్‌కో గెస్ట్ హౌజ్ వద్ద వారిని పలువురు సన్మానించారు. జాతీయ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కర్, బూర్గుల వెంకటేశ్వరరావు, కాంపాటి దుర్గాప్రసాద్, మహేష్, నవతన్ పాల్గొన్నారు.

విద్యాధరి ఫౌండేషన్‌కు విరాళం



విరాళం అందజేస్తున్న పావని

కొత్తగూడెంఅర్బన్ /కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని విద్యాదరి ఫౌండేషన్‌కు బూర్గంపాడు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.పావని రూ.10 వేలు విరాళంగా అందజేశారు. శనివారం కొత్తగూడెంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బైరీ రాజేష్‌ఖన్నాను కలిసి నగదు అందజేశారు. రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ పేద విద్యార్థులకు పావని సహాయం చేయడం అభినందనీయమన్నారు. పేద విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా చేయూతనందిస్తున్నామని తెలిపారు.

కుండపోత వాన

టేకులపల్లి: టేకులపల్లిలో శనివారం కుండపోత వాన కురిసింది. మండలకేంద్రంలో ప్రధాన రోడ్డుపై వరద నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బంది కలిగింది. పుణ్యపువాగు, తూర్పుగూడెం వాగు, రాంపురం వాగు, కొండంగులబోడు వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీ అధికారులు ఆ రహదారుల గుండా రాకపోకలను నిలిపివేశారు.

తల్లీ.. భవానీ!



- శ్రీదేవి నవరాత్రుల్లో ఏటా దుర్గమ్మ దీక్ష
- నానాటికీ పెరుగుతున్న మాలధారులు

సండే స్పెషల్

పాల్వంచరూరల్: దసరా పండగ వస్తుందంటే శ్రీదేవి శరన్నరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇదే సమయాన ప్రధాన ఆలయాల్లోనే కాక వాడవాడలా దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇదే సమయాన ఏటా ఈ సయయంలో భవానీ దీక్ష స్వీకరించే వారి సంఖ్య పెరుగుతోంది. ఆడామగ, చిన్నాపెద్ద తేడా లేకుండా భవానీ మాల దీక్ష బూనుతున్నారు. గతంలో నవరాత్రి ఉత్సవాలంటే ఆలయాల్లోనే అమ్మవారి సన్నిధిలో దీక్ష చేపట్టి తొమ్మిది రోజులపాటు నిష్ఠగా పూజలను ఆచరించేవారు. కానీ ఇప్పుడు ఊరూరా పురవీధుల్లో అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లుగానే మాల ధరిస్తున్నారు. గతంలో ఎక్కువగా పురుషులే స్వీకరించే దీక్ష ఇప్పుపడు మహిళలు, చిన్నారులు, వృద్ధులు, యువతులు కూడా మాల ధరిస్తుండడం విశేషం. అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు నిష్ఠగా పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయని నమ్మకంతో దీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, కొందరు తొమ్మిది రోజుల దీక్ష పాటిస్తుండగా ఇంకొందరు 11రోజులు, మరికొందరు 41రోజులు కూడా దీక్ష చేస్తున్నారు. ఈ ఏడాది కూడా భవానీ దీక్ష తీసుకున్న వారి సంఖ్య గతేడాది కంటే పెరిగింది. భవానీ దీక్షాధారులు ఎరుపు రంగు దుస్తులు, మెడలో ఎర్రటి కండువా ధరిస్తున్నారు.



పెద్దమ్మతల్లి ఆలయం మండపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మాలధారులు

తొలిసారి దీక్ష చేస్తున్నా..



తొలిసారిగా ఈ ఏడాది భవానీ దీక్ష తీసుకున్నా. అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు నిష్ఠగా పూజిస్తే మంచిదని చెప్పడంతో దీక్ష చేపట్టాను. అంతేకాక అమ్మ వారిపై నమ్మకం, భక్తిభావం దీక్ష వైపు నడిపించాయి. – జక్కుల తనుశ్రీ, సూరారం

కోరికలు తీరుతాయని..



గత రెండు సంవత్సరాలుగా విజయదశమికి భవానీ మాత దీక్ష పాటిస్తున్నాను. కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకంతో దీక్ష పాటిస్తున్నా. ఈ తొమ్మిది రోజులు అమ్మ వారికి పూజ చేస్తూ సేవలో నిమగ్నమవుతుంటా. – జ్యోతి, బిల్లుడుతండా

అమ్మవారికి సేవ చేసేందుకు..



భవానీ మాతకు సేవలు చేయడానికి తొలిసారిగా దీక్ష చేపట్టాను. దీక్ష చేస్తే చాలా మందికి జరిగిందని.. నాకు సైతం మంచి జరుగుతుందనే నమ్మకంతో దీక్ష తీసుకున్నాను. ఈ సమయంలో ప్రతిరోజు పూజలు చేస్తా. – అరుణ, ఇల్లెందు

ప్రశాంతత కోసం..



అమ్మవారు అంటే భక్తి. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు నిష్ఠగా పూజలు, సేవలు చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది. దీక్ష చేపట్టడం ఇది మూడోసారి. – కళ్యాణి, కొత్తగూడెం

కాంట్రాక్ట్ కార్మికులపై వివక్ష వీడాలి



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కాంట్రాక్ట్ కార్మికులపై వివక్ష వీడి బోనస్ 15శాతం చెల్లించాలని, శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.సీతారామయ్య, రీజియన్ కార్యదర్శి ఎన్.సంజీవ్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఒకే కుటుంబం, ఒకే లక్ష్యమంటూ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల సవతితల్లి ప్రేమ చూపుతోందని, పర్మనెంట్ కార్మికులను ఒక రకంగా, కాంట్రాక్ట్ కార్మికులను మరోరకంగా చూస్తోందన్నారు. పర్మనెంట్ కార్మికులకు రూ.వేలల్లో బోనస్ పెంచి, కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.5 వందలు, అంటే రోజుకు రూ.1.30 పెంచటం గర్హనాయమన్నారు. తక్షణమే యాజమాన్యం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.సంజీవ్, మల్లికార్జున్, శరత్, రాజేశ్వరి, ఉలికి బాబ, వెంకన్న, లక్ష్మి, అవినాష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రహదారి ఏర్పాటు చేయండి..

సుజాతనగర్: సుజాతనగర్ ముత్యాలమ్మ రహదారిని బీటీ రోడ్డుగా ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో గుంతలమయంగా మారిన రహదారిని శనివారం పరిశీలించారు. పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ మట్టి రోడ్డులో టిప్పర్లు, పెద్ద వాహనాలు తిరగడం వలన గుంతలమయంగా మారిందన్నారు. ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని గతంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో కాట్రాల తిరుపతిరావు, భాస్కర్, బచ్చలకూర శ్రీనివాస్, భూక్యా శంకర్, పుల్లయ్య, శ్రీను పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్, ఎస్.రంగనాథ్ కోరారు. శనివారం ఇల్లెందులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అబ్దుల్ నబీ, జబ్బార్, వసంత్, పోషం, సన రాజేష్, లలిత్ కుమార్ పాసీ, ఉపేందర్, ఎర్రబెల్లి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు. జేకేలోని సింగరేణి క్వార్టర్‌లో మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ధాన్యం ప్రమోద్‌కుమార్, గిన్నారపు రాజేష్ పాల్గొన్నారు.

రేపు సింగరేణిలో ప్రత్యేక వైద్యశిబిరం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈనెల 29, 30వ తేదీలలో సఫాయి కార్మికులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. యాజమాన్యం సూచనలతో సింగరేణి వ్యాపితముగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా 'సఫాయి సురక్ష శివిర్స్'అనే నినాదంతో సింగరేణిలో పనిచేసే రెగ్యులర్, కాంట్రాక్టు సఫాయి కార్మికులు, కుటుంబ సభ్యులకు అన్ని ఏరియా ఆస్పత్రులలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా కార్పొరేట్, కొత్తగూడెం ఏరియాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత ఆన్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముస్లిం మైనార్టీలకు ప్రకటించిన 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన', 'రేవంత్ అన్న కా సహారా'పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారిచేసిందని ఏఎస్‌జే చైర్మన్ ఎంఏ రజాక్ తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని ఏఎస్‌జే జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. మాట్లాడుతూ ఈ పథకాలకు దరఖాస్తులు చేసుకునేందుకు అక్టోబర్ 6 గడువు ఉందని, దరఖాస్తు చేసుకునే మహిళాలకు సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8886934260 నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

విజేతలకు కలెక్టర్ అభినందన



అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ స్టేడియంలో జరిగిన 36వ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ – 2025 జావెలిన్‌త్రో పోటీలలో జిల్లాకు చెందిన బి.పృథ్వీక రజతం, షేక్ ఆఫ్రీన్ కాంస్య పతకం సాధించారు. విజేతలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామ రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మహీధర్, కోచ్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సభకు తరలిరండి..

ఇల్లెందు: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలిగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో భద్రాచలం ధర్మయుద్ధ సభ విజయవంతం కోసం చేపట్టిన ర్యాలీ ఇల్లెందుకు చేరింది. శనివారం సమ్మక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి ర్యాలీకి స్వాగతం పలికారు. పట్టణ పుర వీధులు గుండా ప్రారంభమైన ర్యాలీ కొత్తబస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. కొమురంభీం విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని, జల్ జంగిల్ జమీన్‌తోపాటు జాబ్స్ కూడా కావాలని కోరారు. చట్టబద్ధత లేని లంబాడీలు ఆదివాసీల పొట్ట కొడుతున్నారని పేర్కొన్నారు. చుంచు రామకృష్ణ, జోగ రాంబ్రహ్మం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు..



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: గ్రామీణ వైద్యులు స్థాయిని మించి వైద్యం చేయొద్దని జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో గ్రామీణ వైద్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రోగులకు హై యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇష్టారాజ్యంగా వైద్యం చేయవద్దన్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వని, సీహెచ్ఓ ఎం.రామకృష్ణ, యూడీసీ వెంకటేశ్వర్లు, గ్రామీణ వైద్యులు పూసాల శ్రీనివాసా చారి, పూజల నాగేశ్వరరావు, ఉసికల నరసింహారావు, సున్నం ప్రసాద్, కొడుమూరి భాను ప్రకాష్, పణిత మార్క్, ఎం.రామకృష్ణ, గడిదేశి ప్రేమ్‌కుమార్, ఎస్.రామరాజు, మృత్యుంజయరావు, బాబూరావు, జి.నరసింహారావు, ఎస్.రమేష్, సీహెచ్ వేణు, నిమ్మటూరి రామారావు, కె.కుసుమ, కె.ప్రమీల, వెంకటేశ్వరరావు, ఉపేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కుల వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఉద్యమం



మాట్లాడుతున్న చంద్ర అరుణ

ఇల్లెందురూరల్: జోత్యారావు పూలే స్ఫూర్తితో కుల వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ఉద్యమించాలని మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ పిలుపునిచ్చారు. పోలారం గ్రామంలో మాస్‌లైన్ ఆధ్వర్యంలో కుల వ్యవస్థ నిర్మూలన వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అన్నివర్గాల ప్రజలతో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. దేశంలో కుల, అణచివేత, అంటరానితనం, మహిళల అసమానత్వం, వర్గ దొంతరలు, శాంతి వివక్షతల మధ్య విడదీయరాని సంబంధాలను పూలే గుర్తించి అణగారిన వర్గాల విద్య, వ్యవసాయం, సమానత హక్కులకై ఉద్యమించాలని గుర్తుచేశారు. సామాజిక విప్లవకారుడిగా పూలే తన ఆలోచనలను విస్తృతపరిచి సామాజిక చైతన్యాన్ని రగిలించాలని, పుస్తకాలు రచించి సమాజానికి పరిచయం చేశాడని పేర్కొన్నారు. పూలే, అంబేద్కర్ ఆలోచనలపై నేటి పాలకులు దాడులకు పూనుకుంటున్నారని, అందులో భాగంగానే కులం, మతం పేరుతో ఓట్లు దండుకుంటూ ప్రజల మధ్య విబేధాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పాలకుల ధోరణిపై ప్రజల్లో చైతన్యం కల్పించి మరో ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాలని కోరారు. నాయిని రాజు, బుర్ర వెంకన్న, బిచ్చా, బోస్, పృథ్వీ, శ్రీరాం కోటయ్య, సావిత్రి, బుర్ర రాఘవులు, జూకంటి గాంధీ పాల్గొన్నారు.

డైలీవేజ్ వర్కర్ల మానవహారం



మానవహారం చేపట్టిన వర్కర్లు

ఇల్లెందు: 15 రోజులుగా ఆందోళన చేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కారంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఏ నబీ, తాళ్లూరి కృష్ణ ఆరోపించారు. శనివారం ఇల్లెందు జగదాంబా సెంటర్‌లో జరిగిన ఆందోళన, మానవహారం అనంతరం వారు మాట్లాడుతూ డైలీవేజ్ వర్కర్ల సమస్యలు నానాటికీ జఠిలంగా మారుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పద్మ, రామకళ, లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, జయ, ముత్తయ్య, నాగేశ్వరరావు, స్వామి, మంగ, స్వరూప, అంజమ్మ, అనిత, డైలీవేజ్ వర్కర్లు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

పాల్వంచరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. పెద్దమ్మతల్లి ఆలయ సముదాయంలోని ఫంక్షన్ హాల్ శనివారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రిసైడింగ్ అధికారులు సమయపాలన పాటించాలని, ఎటువంటి అనుమానాలకు అవకాశం లేకుండా విధులు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు సాయికృష్ణ, పార్థసారధి, ప్రకాశ్‌రావు, సూపరింటెండెంట్ సుధాలక్ష్మి, ఎంపీఓ చెన్నకేశవులు, వీరబాబు పాల్గొన్నారు.

రిజిస్టర్ చించివేసిన పీఓలు..

స్థానిక ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ ఆఫీసర్ల (పీఓ)లకు శనివారం శిక్షణ ఇచ్చారు. సుమారు 500 మందిపైన ఉపాధ్యాయులు, ఇతర శాఖల సిబ్బంది హాజరయ్యారు. అయితే పీఓలు శిక్షణకు హాజరైనట్లుగా రిజిస్టర్‌లో సంతకాలు పెట్టాలని సూచించారు. అయితే కేవలం రెండు రిజిస్టర్లు మాత్రమే వేదిక వద్ద ఉంచడంతో సంతకాలు పెట్టేందుకు పోటీపడ్డారు. నేను ముందుగా అంటే నేను ముందుగా.. అంటూ ఒకరికొకరు గుంజుకోవడంతో రెండు రిజిస్టర్లూ చిరిగిపోయాయి.

ఇల్లెందురూరల్: ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. సీఈఆర్ క్లబ్ ఆవరణలో పంచాయతీ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శనివారం ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు.

మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నుంచి కౌంటింగ్ దశ వరకు అన్ని అంశాలు సున్నితంగా ఉంటాయని గుర్తుచేశారు. ప్రతీ ప్రక్రియలోనూ నిబంధనలకు లోబడి మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ సమయంలో గడువు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి వివాదాలకు అవకాశం ఇవ్వకూడదని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఏజెంట్ల సమక్షంలో బాక్స్‌లకు సీల్ వేయాలని సూచించారు. అందరూ సమయపాలన పాటించి ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎంపీడీఓ తాళ్లూరి రవి

జూలూరుపాడు: 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు–2025 నిర్వహణలో భాగంగా శనివారం జూలూరుపాడు ఆర్యవైశ్యకల్యాణ మండపంలో జూలూరుపాడు ఎంపీడీఓ తాళ్లూరి రవి ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి విధులు, బాధ్యతలు మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, అన్ని శాఖల ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీఓ టి.తులసీరామ్, మాస్టర్ ట్రైనర్ డి.భాస్కర్, పుల్లారావు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: సంతకాలు పెట్టేందుకు రిజిస్టర్‌ను లాక్కుంటున్న పీఓలు

రిజర్వేషన్లు ఖరారు

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామ పంచాయతీ వార్డులు, మహిళా రిజర్వేషన్లపై శనివారం రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తాళ్లూరి రవి మాట్లాడుతూ మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో 198 వార్డులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం రాజకీయ నాయకుల సమక్షంలో మహిళా రిజర్వేషన్లు ఖరారు చేశారు.

జూలూరుపాడు జెడ్పీటీసీ బీసీ (జనరల్), ఎంపీపీ ఎస్టీ (జనరల్) అయింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, టీడీపీ నాయకులు రోకటి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- ప్రమాదాలకు నిలయంగా మారిన జాతీయ రహదారి
- రాకపోకలకు ప్రజలు, వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

టేకులపల్లి: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు, వాహనదారులకు శాపంగా మారింది. ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎన్‌హెచ్ 930పీ రోడ్డు యమలోకానికి దారిలా మారింది. ప్రాణాలు పోతే కానీ అధికారులు పట్టించునేలా కనిపించడం లేదు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సొంత మండలంలో ప్రధాన రహదారి ఇలా ఉండడం గమనార్హం.

ఎన్‌హెచ్ 930పీ రహదారి..

హైదరాబాద్ ఓఆర్ఆర్ సమీపంలోని గౌరెల్లి వయా వలిగొండ నుంచి కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు 230 కిలోమీటర్ల ప్రధాన రహదారిని జాతీయ రహదారి ఎన్‌హెచ్ 930పీగా 2016లో రూపకల్పన చేశారు. కొత్తగూడెం జిల్లాలోని నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం క్రాస్ రోడ్ వరకు 52 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డును 2018లో జాతీయ రహదారి సంస్థ తమ ఆధీనంలోకి తీసుకుంది. నాటి నుంచి నేటి వరకు ఈ రహదారి పర్యవేక్షణ ఎన్‌హెచ్ అధికారులదే. ఈ రోడ్డు చివరి ప్యాకేజీలో ఉంది. ఇల్లెందు నుంచి కొత్తగూడెం క్రాస్ రోడ్ వరకు 52 కిలోమీటర్ల పరిధిలో 22 కిలోమీటర్ల వరకు సుమారు 150 ఎకరాల అటవీ భూమిలో ఉంది ఈ రోడ్డు. ఈ నేపథ్యంలోనే ఫారెస్టు క్లియరెన్స్ రావాల్సి ఉంది.



రోళ్లపాడు క్రాస్‌రోడ్ సమీపంలో అటవీ ప్రాంతంలో ప్రమాదకరంగా గుంతలు



జగదాంబగుంపు నుంచి బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల మధ్య అధ్వానంగా రోడ్డు

అత్యధికంగా రద్దీ రోడ్డు...

జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే అధిక ట్రాఫిక్ ఉన్న రహదారుల్లో ఇల్లెందు – కొత్తగూడెం రహదారి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ పట్టణాల నుంచి వయా ఇల్లెందు మీదుగా పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలంతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు భారీ వాహనాల నిత్యం వచ్చిపోతుంటాయి. దీంతో రోడ్డు ధ్వంసం కావడంతో పాటు అత్యంత ప్రమాదకరంగా గుంతలు ఏర్పడుతున్నాయి.

మొక్కుబడిగా మరమ్మతులు..

ఎన్‌హెచ్ 930పీ నిర్మాణం అయ్యే వరకు మరమ్మతులు చేయించాల్సిన ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం మరియు కెపాసిటీకి మించి వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో ఇల్లెందు నుంచి కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ వరకు ప్రధానంగా టేకులపల్లి మండలం రోళ్లపాడు క్రాస్ రోడ్ నుంచి బొమ్మనపల్లి వరకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వానాకాలం మరీ దారుణం.. నీరే కదా అని వాహనదారులు వెళ్తుండటం, బైక్‌లు, ఆటోలు, కార్లు ఆ గుంతల్లో పడి ఇరుక్కుపోవడమే కాకుండా మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికే చాలామంది చిన్నపిల్లలతో సహా గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. జగదాంబగుంపు నుంచి బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల మధ్య, అక్కడి నుంచి సాయన పేట మధ్య అడవిలోనూ అత్యంత ప్రమాదకరితంగా గుంతలు ఏర్పడ్డాయి.

ప్రతీ సంవత్సరం రూ.కోటి కేటాయింపు..

మరమ్మతుల కోసం ఏటా రూ.కోటి కేటాయిస్తున్నా వాటిని ఎప్పుడు, ఎక్కడ ఉపయోగిస్తున్నారో అధికారులకే తెలియాలి. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడో, ఎమ్మెల్యే చెప్పినప్పుడో మొక్కుబడిగా సిమెంట్, కంకర మిక్సింగ్ వేసి చేతులు దులుపుకుంటున్నారు. వేసిన ప్యాచ్‌లు లారీల తాకిడికి, వర్షం పడినప్పుడు వరద ప్రభావానికి కొట్టుకుని పోతున్నాయి. ప్రాణ నష్టం జరగకముందే అధికారులు మేల్కొని మొక్కుబడిగా కాకుండా పక్కా మరమ్మతులు చేపట్టాలని, ప్రధానంగా టేకులపల్లి సెంటర్‌లో మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.